ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

శనివారం, 20 ఏప్రిల్ 2024





ఆ కుట్ర ముమ్మాటికీ హేయం



గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఖమ్మం మార్కెట్‌లో తుమ్మల

- మచ్చలేని ప్రజానేతను టార్గెట్ చేయడం అనైతికమన్న భిన్నవర్గాలు
- నేలకొండపల్లిలోని మామిడితోట కేంద్రంగా కుట్రకు వ్యూహం..?
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో దాడిని అమలు జరిపేందుకు ప్లాన్
- మొత్తం వ్యవహారంపై కూపీ లాగుతున్న పోలీసులు
- మాజీ పోలీసు అధికారి పాత్రపైనా ఆరా
- సమగ్ర విచారణ జరపాలంటున్న కాంగ్రెస్ నాయకులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో వేడెక్కిన ఉమ్మడి జిల్లా రాజకీయాలు

మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర పన్నడంపై నివ్వెరపోయిన ఉమ్మడి జిల్లా

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం/ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి కొందరు కుట్ర పన్నారని బయటకు పొక్కడంతో రాజకీయవర్గాలు నివ్వెరపోయాయి. 'మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర...' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో శుక్రవారం ప్రచురితమైన కథనం తీవ్ర సంచలనం సృష్టించింది. దీనిపై జిల్లా, రాష్ట్ర పోలీసు అధికారులు కూపీ లాగుతున్నారు. మొత్తం వ్యవహారంపై ఆరా తీస్తున్నారు. మరో వైపు దాడి వ్యూహాన్ని కాంగ్రెస్ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ బృందం ఉమ్మడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఖండించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై సమగ్ర విచారణ జరిపి దాడికి వ్యూహం చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితోపాటు జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు తుమ్మల అనుచరులు, అభిమానులు కూడా తుమ్మలపై దాడికి పన్నిన వ్యూహాన్ని తీవ్రంగా ఖండించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో వెలుగు చూసిన దాడి కుట్రకు ఓ మాజీ పోలీసు అధికారి ప్రధాన సూత్రధారిగా ప్రచారం సాగుతోంది. కొంతమంది హోంగార్డులతో, మరికొందరు ఇతర మనుషులతో ఖమ్మం మార్కెట్‌లో దాడికి కుట్ర పన్నినట్టుగా ప్రచారం సాగుతోంది. పలుసార్లు దాడికి ప్రయత్నించి పరిస్థితులు అనుకూలించక వెనకడుగు వేసినట్టు తెలిసింది. నేలకొండపల్లిలోని ఓ మామిడితోటలో ఈ కుట్రకు వ్యూహం రచించారని తెలిసింది. అటు జిల్లా పోలీసులతో పాటు ఇంటెలిజెన్సు విభాగం కూడా ఈ మొత్తం వ్యవహారంపై సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. మొదట్లో ఆయన పాలేరు నుంచి పోటీచేస్తారని భావించినా.. అనూహ్యంగా ఖమ్మం నుంచి

మిగతా 6వ పేజీలో...

సమగ్ర విచారణ జరిపించాలి..

ఏసీపీకి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

ఖమ్మం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీద హత్యాయత్నం కుట్రపై సమగ్ర విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ఖమ్మం ఏసీపీ రమణమూర్తిని కలిసి ఫిర్యాదు ప్రతిని అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, పత్తి శ్రీనివాస్, చంద్ర రాంబాబు, నల్లమల వేణుచౌదరి, ఆనంద్ తదితరులున్నారు.

కఠినంగా శిక్షించాలి..

ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, మట్టా రాగమయి

భద్రాచలం/సత్తుపల్లి: మంత్రి తుమ్మలపై దాడిచేసేందుకు కుట్ర చేయడంతో పాటు రెక్కీ నిర్వహించిన వారిని కఠినంగా శిక్షించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. భౌతిక దాడుల సంస్కృతి జిల్లాలో లేదని, అజాతశత్రువు తుమ్మలపై దాడికి వ్యూహం పన్నడం వెనుక ఎంతటి వారున్నా వదలొద్దని కోరారు. రాజకీయాల్లో భౌతికదాడులకు కుట్ర పన్నడం సమర్థనీయం కాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



మానుకోట.. కాంగ్రెస్‌కు కంచుకోట

- బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి
- ఉక్కు, కోచ్ ఫ్యాక్టరీలను అడ్డుకున్న బీజేపీ

6

- కమ్యూనిస్టులతో రేపో, మాపో 'కూటమి' చర్చలు పూర్తి
- మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మానుకోట ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోటగానే ఉంటుందని, ఈ ప్రాంతానికి దశాబ్దకాలంపాటు అన్యాయం చేసిన ద్రోహులు బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలో ఆయన మాట్లాడారు. గతంలో పార్లమెంట్‌లో తెలంగాణ వద్దన్న మోదీ.. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి అడ్డుకుంటున్నారని విమర్శించారు. - ఆంధ్రజ్యోతి, మహబూబాబాద్





అవినీతి కాంగ్రెస్‌ను ఓడించండి..



ఖమ్మం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మంనుంచి బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును గెలిపించి ప్రధాని మోదీకి ప్రతినిధిగా పంపించాలని బీజేపీ జాతీయ నేత, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. కమలం గుర్తుకు ఓటువేసి దేశ అభివృద్ధికి సహకరించాలని, కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వినోద్‌రావు గెలుపుకోరుతూ రాజ్‌నాథ్‌సింగ్ శుక్రవారం ఖమ్మంనగరంలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్, అభ్యర్థి తాండ్ర వినోద్‌రావులతో కలిసి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నుంచి జడ్పీ సెంటర్ వరకు డప్పు వాయిద్యాలు, కోలాటాలు, గిరిజన నృత్యాలతో ర్యాలీ సాగింది. జడ్పీ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన దోపిడీ, అవినీతిమయంగా సాగిందని, ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారని, అందుకు తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తెలంగాణలో అవినీతిరహిత ప్రభుత్వం ఏర్పాటు చేయాలని బీజేపీ భావిస్తే అవినీతి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ హయాంలో బోఫోర్స్, చక్కెర, యూరియా కుంభకోణాలు జరిగాయని గుర్తు చేశారు.

పదేళ్ల మోదీ పాలనలో ఎక్కడా అవినీతి జరగలేదని, ఇది కాంగ్రెస్, బీజేపీ పాలనకున్న వ్యత్యాసమన్నారు. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ రావడంతో 370ఆర్టికల్ తొలగించి కశ్మీర్‌ను దేశంలో పూర్తిగా విలీనం చేశామని, ఇది ప్రజలు గమనించాలన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మించి తీరుతామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి జనవరి 22న శ్రీరాముడిని ప్రతిష్ఠ చేసిన ఘనత మోదీదన్నారు. మహిళలందరికీ సమాన హక్కులుండాలని ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశామని గుర్తు చేశారు. ఈసారి బీజేపీ అధికారంలోకి వస్తే కామన్ సివిల్ కోడ్ అమలు చేస్తామని, ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ ఉమ్మడి పౌరసత్వం అమల్లో ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో నెహ్రూ నుంచి ఇందిర రాజీవ్‌గాంధీ వరకు పేదరికం నిర్మూలిస్తామని చెప్పి.. పెంచారు తప్ప.. తగ్గించలేదని, గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తి చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదన్నారు. బీజేపీ ఈసారి అధికారంలోకి వస్తే 70ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరికి రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తామన్నారు. కేంద్రం అమలు చేస్తే పథకాలన్నింటిని ప్రజలకు అందిస్తామని, ఖమ్మంలో తాండ్ర వినోద్‌రావును గెలిపించి ప్రధానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు క్రాంతి పాల్గొనగా.. కార్యకర్తలు జెండాలు పట్టుకుని ర్యాలీకి హాజరయ్యారు. ఈ రోడ్ షో కార్నర్ సమావేశంలో పార్టీ అభ్యర్థి వినోద్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి ప్రసంగిస్తూ కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలన్నారు.

- మోదీ పాలనలో దేశం ఎన్నో విజయాలు సాధించింది
- బీజేపీ జాతీయ నేత, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- నగరంలో ఉత్సాహంగా రోడ్ షో
- పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ శ్రేణులు



బీజేపీ అభ్యర్థి తాండ్ర నామినేషన్

- వెంట వచ్చిన సుధాకర్‌రెడ్డి, ఇతర నేతలు
- ఖమ్మంలో విజయం ఖాయమని ధీమా

6

బీఆర్ఎస్‌కు రాములు నాయక్ గుడ్‌బై



- పార్టీలో తనను అవమానాలపాలు చేశారని ఆవేదన
- అధిష్ఠానాన్ని ఉద్దేశిస్తూ రాజీనామా లేఖ విడుదల

వైరా, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపించారు. రాములునాయక్ బీఆర్ఎస్‌ను వీడనున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 17న కథనం ప్రచురితం కాగా, అదేరోజు ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు రాములునాయక్ ఇంటికి వెళ్లి బుజ్జగించారు. అయితే పార్టీలో తనకు జరిగిన అవమానాన్ని రాములునాయక్ ఏకరువు పెట్టారు. తాను 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌పై విజయం సాధించి, ఎలాంటి షరతులు లేకుండా బీఆర్ఎస్‌లో చేరానని వారికి గుర్తు చేశారు. 'గతేడాది నవంబరులో తెలంగాణ అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేనైన నాకు టికెట్ నిరాకరించి మదన్‌లాల్‌కు ఇచ్చారు. కానీ ఆయన గెలవలేదు... ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా మదన్‌లాల్‌కే వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ బాధ్యతలు కట్టబెట్టారు. అన్ని రకాలుగా నన్ను అవమానించారు..' అని రాములు బీఆర్ఎస్ నేతల ఎదుట కుండబద్దలు కొట్టారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని కోరారు.

కాంగ్రెస్ అసలు రంగు తెలిసింది..

- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం ఖాయం
- రాష్ట్రంలో 10 స్థానాలను గెలుస్తాం..
- బీఆర్ఎస్ అభ్యర్థి నామా, మాజీ మంత్రి పువ్వాడ



మాజీ మంత్రి పువ్వాడను సన్మానిస్తున్న ఎంపీ నామా

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 19: మాయమాటలు నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, ఇప్పుడు ఆ పార్టీ అసలు రంగు తేలటంతో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీమంత్రి పువ్వాడ అజయ్ ఆధ్వర్యంలో ఖమ్మం నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ అభ్యర్థిగా బీఫామ్ తీసుకొని మీముందుకు వచ్చానని, మూడోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మారన్నారు. ప్రస్తుతం కార్యకర్తలు, నాయకులు ప్రతి ఇంటికి తిరిగి కాంగ్రెస్ వైఫల్యాలను ప్రచారం చేయాలన్నారు.

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ నామాను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. బీఆర్ఎస్‌ది కుటుంబపాలన అని విమర్శించిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి రాగానే తమ కుటుంబ సభ్యులకు ఖమ్మం ఎంపీ సీటు ఇప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నదని పువ్వాడ పేర్కొన్నారు. ఇప్పుడు వచ్చే కాంగ్రెస్ కుటుంబసభ్యుల పాత్ర తెలంగాణ ఉద్యమంలో ఉందో లేదో ప్రజలకు తెలుసన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 10స్థానాలు గెలుస్తుందని, అందులో ఖమ్మం ఒకటని పేర్కొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఆచరణసాధ్యం కాని హామీలను కాంగ్రెస్ ఇవ్వటంతో మోసపోయిన ప్రజలు కేసీఆర్ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరూనాయక్, ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పువ్వాడ జన్మదిన వేడుకలు

ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పువ్వాడ కేక్‌కట్ చేశారు. కార్పొరేటర్లు, నాయకులు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు ఇచ్చి పువ్వాడకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



6

హామీలన్నీ ఓట్ల మాటలే..

లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు సవాళ్లు



లెక్క పక్కాగా..

- అభ్యర్థుల ఖర్చులను కచ్చితంగా నమోదు చేయాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకులు

6



మహదాశీర్వచనం నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణ రామునికి మహదాశీర్వచనం

భద్రాచలం, ఏప్రిల్ 19: భద్రాద్రి కల్యాణ రాముడికి వేద మంత్రాలతో మహదాశీర్వచనాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం భద్రాద్రి రామయ్యకు ఆలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ వేదిక వద్ద మహదాశీర్వచనం నిర్వహించారు. వివాహం జరిగిన తరువాత నూతన వధూవరులైన సీతారాములకు పండితులు వేదాశీర్వచనం ఇవ్వడమే సదస్యం పరమార్థం. సదస్యం ముఖ్య ఉద్దేశ్యం సీతారాముల కల్యాణ క్రతువులో పాల్గొని తిలకించిన భక్తులకు సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఈ ఉత్సవాల్లో అంతర్భాగంగా సదస్యం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగురాష్ట్రాల నుంచి చతుర్వేద పండితులు, ద్రవిడ దివ్యప్రబంధం పారాయణం చేసేందుకు వైదిక బృందం తరలి వచ్చి భద్రాద్రి రామునికి తమ వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి హంస వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీ రామకృష్ణారావు, పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు. కాగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెప్పోత్సవం, చోరోత్సవం నిర్వహించనున్నారు.



హామీలన్నీ.. ఓట్ల మాటలే

ఎన్నికలప్పుడు హామీలు గుప్పించి ఎన్నికల అనంతరం వాగ్దానాలు విస్మరించటంతోపాటు హామీల అమలుకు కేంద్రంపై వత్తిడి చేయలేక పోయిన ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఈ లోక్‌సభ ఎన్నికలు సవాళ్లుగా నిలవనున్నాయి. మహబూబాబాద్ లోక్ సభ నియోజక వర్గం ఏర్పడి పదిహేనేళ్లు కావొస్తున్నా ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి ఉపాధి అవకాశాల కల్పనకు గెలుపొందిన ప్రజా ప్రతినిధులు కృషి చేయలేదన్న విమర్శలొస్తున్నాయి. అపారమైన ఖనిజ నిక్షేపాలతోపాటు గోదావరి జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ పరిశ్రమలు సాధించటంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఇల్లెందు, మహబూబాబాద్ నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో ఖనిజ నిక్షేపాలు ఉన్నా అనుబంధ పరిశ్రమలు సాధించలేకపోయారన్న విమర్శలున్నాయి.

- లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు సవాళ్లు
- వనరులున్నా పరిశ్రమల సాధనలో నేతలు విఫలం
- ఉక్కుఫ్యాక్టరీ ఆశలు అడియాసలేనా?
- అతీగతి లేని సీతారామ ప్రాజెక్టు
- గనుల ప్రైవేటీకరణతో సింగరేణి అస్తిత్వానికే ముప్పు

ఇల్లెందు, ఏప్రిల్ 19: ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గంలోని బయ్యారం మండలంలో ఉక్కుఫ్యాక్టరీ ఆశలు ఆవిరవుతున్నాయి. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో 13వ షెడ్యూల్‌లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పుతామని హామీ ఇచ్చింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో రూ.36వేల కోట్ల వ్యయంతో కర్మాగారం నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం, అనంతరం రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కానీ ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు పూనుకోలేదు. షుమారు 30వేల మంది ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ఉపాధి లభ్యం అవుతుందని అప్పట్లో పాలకులు ఆశలు రేకెత్తించారు.

మూడు జిల్లాల్లో 11 శాతం ముడి ఖనిజం

ఖమ్మం, వరంగల్, కరీంనగర్, జిల్లాల పరిధిలో 56,690 హెక్టార్లలో ఇనుప ఖనిజ నిక్షేపాలున్నట్లు దేశంలో లభ్యమవుతున్న ముడి ఇనుపఖనిజంలో 11 శాతం నిల్వలు ఈప్రాంతాల్లోనే ఉన్నట్లు జియాలజికల్ సర్వే అధికారులు గుర్తించారు. మహబూబాద్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలతోపాటు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కారేపల్లి, కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలాల్లో దాదాపు వంద కోట్ల టన్నుల మేర ఇనుపఖనిజం ఉన్నట్లు అంచనావేశారు. ఐతే ఉక్కుకర్మాగారం బయ్యారం ప్రాంతంలో నెలకొల్పటానికి అవసరమైన బొగ్గు, డోలమైట్, ముడిఇనుము విద్యుత్, నీరు సౌకర్యాలు, రైలు మార్గం ఉన్నప్పటికీ సర్వేల పేరుతో కాలయాపనచేయటమే తప్ప ఫ్యాక్టరీ నిర్మాణం ఊసెత్తటం లేదు.

అతీగతి లేని సీతారామ ప్రాజెక్టు

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అశ్వాపురం మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీతరామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద సీతారామ ప్రాజెక్టుకు అప్పటి సీఎం కేసీఆర్ 2016 ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో 6.74లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.13వేల కోట్ల అంచనాలతో ప్రణాళికలు రూపొందించారు. ఏడేళ్ల దాటుతున్నా ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో ఎటువంటి పనులూ చేపట్టలేదు.

తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు..

గోదావరి నది చెంతనే ఉన్నా ఆయా నియోజకవర్గాల్లో సాగునీటికి ఏకైక వనరుగా ఉన్న సీతారామ ప్రాజెక్టు శంకుస్థాపన చేసినా నియోజకవర్గంలో తట్టెడు మట్టి పని కూడా చేయక పోవటం గమనార్హం. సీతారామ ప్రాజెక్టు ద్వారా రోళ్లపాడు, బయ్యారం, గార్ల చెరువులను రిజర్వాయర్లుగా మారుస్తామని హామీలిచ్చినా ఆచరణకు నోచలేదు. ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి ఇల్లెందు మండలంలో 13,648 ఎకరాలు, టేకులపల్లి మండలంలో 12,788 ఎకరాలు, కామేపల్లి మండలంలో 14,501, గార్ల మండలంలో 10,904 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.30,320కోట్ల అంచనాలతో డీపీఆర్ రూపొందించారు. తదనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరగటం బీఆర్ఎస్ అధికారం కోల్పోవటంతో సీతారామప్రాజెక్టు భవితవ్యం అగమ్యగోచరంగా మారింది.

ప్రైవేటీకరణతో సింగరేణికి ముప్పు

మైన్స్ అండ్ మినరల్ డెవలప్ మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ 1957కు సవరణలు చేసి దేశవ్యాప్తంగా బొగ్గు బ్లాకులను టెండర్ల ద్వారా ప్రైవేటు పరం చేసే చర్యలు ప్రారంభించారు. దీంతో దక్షిణాది రాష్ట్రాలకు వెలుగులు పంచుతున్న సింగరేణి ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గనుల ప్రైవేటీకరణ బిల్లు పార్లమెంటులో ప్రతిఘటించలేక పోవటంతో సింగరేణికి చెందిన 4 బొగ్గుబ్లాకులు ప్రైవేటీకరణ టెండర్లుగా కూరుకు పోయాయి. ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం బ్లాక్ 3, సత్తుపల్లి బ్లాక్ 3, కల్యాణఖని బ్లాక్ 6, శ్రావణపల్లి బొగ్గుగనులను కేంద్రం టెండర్ల ప్రక్రియలో చేర్చింది. ఫలితంగా భవిష్యత్తులో నూతన గనులు పొందటానికి సింగరేణి సంస్థ సైతం టెండర్లు దాఖలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.


బయ్యారం ఇనుపఖనిజం

కార్మికులకేది భరోసా..

బొగ్గుగని కార్మికుల ఇన్ కం టాక్స్ రద్దు చేయటం, కోల్ ఇండియాలో అమలు చేస్తున్న విధంగా కార్మికుల ఆదాయ పన్ను యాజమాన్యాలు చెల్లించే విధానాన్ని సాధించలేక పోయారన్న ఆవేదన సింగరేణి కార్మికుల్లో వ్యక్తం అవుతోంది. సీఎస్ఆర్ నిధులు బీఎంఎఫ్‌టీ నిధులు కోల్‌బెల్ట్ ప్రజా ప్రతినిధులు స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ పేరుతో వేలాది కోట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్నా తమ గోడు పట్టించుకోవటం లేదని కార్మికులు వాపోతున్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ చట్టాన్ని సవరిస్తేనే సింగరేణిలో నూతన గనులు ఏర్పాటుచేసే అవకాశాలున్నాయని, లేకుంటే సింగరేణి ఉనికికే ముప్పు వాటిల్లుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.


కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల

మున్నేరు కేబుల్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి..

- వర్షాకాలంలో పనులకు అంతరాయం కలగొద్దు
- కేబుల్ బ్రిడ్జి వద్ద చెక్‌డ్యాం ఏర్పాటు చేయండి
- నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాకాలం రాకముందే మున్నేరు కేబుల్ బ్రిడ్జి కాంక్రీట్ పనులు పూర్తిచేయాలని, వర్షాకాలంలో పనులకు ఆటంకం ఉండవద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఖమ్మంలో మంత్రి తుమ్మలను మున్నేరు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సంస్థ ప్రతినిధులు కలిసి పనులపై వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. కేబుల్‌బ్రిడ్జి వద్ద నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యాం నిర్మించేందుకు నీటిపారుదలశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, తద్వారా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. అలాగే పాత బ్రిడ్జిని సుందరంగా తీర్చిదిద్ది పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసుల సలహాలు తీసుకుని ప్రజలకు అసౌకర్యం కలగకుండా కేబుల్ బ్రిడ్జి ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కొత్తగా నిర్మించే రిటర్నింగ్ వాల్ సంస్థను కూడా సమన్వయం చేసుకోవాలని సూచించారు.

స్వతంత్ర అభ్యర్థిగా దుర్గ నామినేషన్



మణుగూరుటౌన్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థినిగా మణుగూరుకు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పాల్వంచ దుర్గ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి తన నామినేషన్ పత్రాలను సామాజిక కార్యకర్త కర్నె రవితో కలసి అందజేశారు.

ఆ కుట్ర ముమ్మాటికీ హేయం

(5వ పేజీ తరువాయి)
ఎన్నికల బరిలో దిగారు. అప్పటి రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై తుమ్మల ప్రత్యర్థిగా ఎన్నికల బరిలో దిగడంతో ఖమ్మం అసెంబ్లీ పోరు రాష్ట్ర రాజకీయాల్లోనే రసవత్తరాన్ని రేపింది.

తుమ్మల పేరు ఖరారు కావడంతోనే ఖమ్మంలో తుమ్మల గెలుపు ఖాయమన్న చర్చసాగింది. ఈ నేపథ్యంలో మాజీ పోలీసు అధికారి ఒకరు కిందిస్థాయి పోలీసులను, హోంగార్డులను తన చేతిలో పెట్టుకుని బీఆర్ఎస్ గెలుపుకోసం ప్రయత్నాలు చేశారు. దాడి ద్వారా ఖమ్మంలో కాంగ్రెస్ గెలుపు గ్యారంటీ అన్న టాక్‌ను టర్న్ చేసేందుకు కుట్ర పన్నినట్టు ప్రచారం సాగుతోంది. కొందరు హోంగార్డులను, మరికొందరిని దాడికి ప్రయోగించేందుకు ప్రయత్నించి విఫలమైనట్టు తెలిసింది. ఈమేరకు పోలీసు వర్గాలు కూడా కూపీ లాగుతున్నారు. ఒకవైపు ఫోన్‌ట్యాపింగ్‌లో వెలుగు చూస్తున్న పలు అంశాలలో తుమ్మలపై దాడి వ్యూహం కూడా వెలుగులోకి రావడం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

హింసాత్మక రాజకీయాలకు దూరంగా, అభివృద్ధి రాజకీయాలకు దగ్గరగా ఉండే వ్యక్తిత్వం తుమ్మలది. గత 40 ఏళ్లలో గెలుపోటములు అనేకం చూసిన తుమ్మల.. అధికారంలో ఉన్నప్పుడు కూడా ప్రత్యర్థులను స్నేహపూర్వకంగానే చూస్తారనే పేరు ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి, ఖమ్మం, పాలేరులో పలుసార్లు గెలిచినా.. ఓడినా.. తుమ్మల అందరితోనూ స్నేహ సంబంధాలే కొనసాగించారు. అటువంటి నేతపై కొందరు దాడికి కుట్ర పన్నడాన్ని రాజకీయాలకతీతంగా అందరూ ఖండిస్తున్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి దోషులు ఎంతటివారైనప్పటికీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన పలు మండలాల నాయకులు, అభిమానులు సైతం ఈ కుట్రను తీవ్రంగా ఖండించారు. జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్లిన తుమ్మలపై దాడికి కుట్ర పన్నటం దుర్మార్గపు చర్య అని వారు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కొత్తగూడెం కమ్మసేవా సంఘం అధ్యక్షుడు బిక్కసాని నాగేశ్వరరావు ఈ కుట్రను తీవ్రంగా ఖండిస్తూ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు, అశ్వాపురం, కరకగూడెం, మణుగూరు, భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, కొత్తగూడెం, చంద్రుగొండ, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, టేకులపల్లి, సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి తదితర మండలాలకు చెందిన తుమ్మల అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు సైతం ఈ కుట్రను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దాడి కుట్రపై తగిన రీతిలో దర్యాప్తు చేయించి కుట్రకు సంబంధించిన వ్యక్తులను వెలికి తీసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు

మానుకోట.. కాంగ్రెస్‌కు కంచుకోట

మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోటగానే ఉంటుందని, ఈ ప్రాంతానికి దశాబ్దకాలం పాటు అన్యాయం చేసిన ద్రోహులు బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ... గతంలో పార్లమెంట్‌లో తెలంగాణ వద్దన్న మోదీ.. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి అడ్డుకుంటున్నారని విమర్శించారు. అలాంటి బీజేపీకి ఓట్లు వేయాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఓట్లు ఏం మొఖం పెట్టుకుని అడుగుతున్నారని, ఆయనకు సిగ్గుండాలని ధ్వజమెత్తారు. ఇక ఇండియా కూటమితో కలిసి రావడానికి కమ్యూనిస్టులు, తెలంగాణ జనసమితి, ప్రజాసంఘాలతో చర్చించే బాధ్యతను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అప్పగించామని, రేపో, ఎల్లుండో ఆ చర్చలు పూర్తవుతాయన్నారు. తద్వారా కలిసొచ్చే ప్రజాస్వామ్య శక్తులతో ఇండియా కూటమి గెలుపు ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధానిగా ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. తెలంగాణలో సర్పంచ్‌ల స్థాయి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల వరకు పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా... మహబూబాబాద్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. అలాంటి అభివృద్ధి చేయని బీఆర్ఎస్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో బండకేసి కొట్టారని గుర్తు చేశారు. తిరిగి లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ తోడుదొంగలు..

ఢిల్లీలో మోదీ... తెలంగాణలో ఫాంహౌజ్ కేడీ ఇద్దరు తోడు దొంగలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం కుదిరిందని, అందుకే రాష్ట్రంలో ఐదు సీట్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలు, 370 ఆర్టికల్, తదితర అమలుకు మోదీకి అండగా నిలబడి గెలిపించాయన్నారు. ఆ కవిత ఐనా.. ఈ కవిత ఐనా ఒక్కటేనంటూ కల్వకుంట్ల కవితను, మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన ఆయన బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్‌కు కోచ్ ఫ్యాక్టరీ రాకుండా అడ్డుకుంది కేంద్రంలోని బీజేపీయేనని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆయా ఫ్యాక్టరీలు రాకుండా ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు అభివృద్ధి చెందకుండా పాతరేసింది వారు కాదా అని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీ మంజూరయితే ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవుతారనే ఉద్దేశంతో మంజూరు ఆలస్యం చేసింది బీజేపీయేనని మండిపడ్డారు. ఎంపీలందరూ కలిసి కన్న తల్లి, దేవతలాంటి సోనియమ్మను అడిగితే రాష్ట్రం ఇచ్చిందని ఐనా సోనియమ్మ ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదన్నారు. ఆ అమ్మ బిడ్డ రాహుల్‌ను ప్రధాని చేసి రుణం తీర్చుకోవాలన్నారు.

నాడు బలరాం మంత్రి.. మళ్లీ గెలిస్తే ఇంకా పెద్ద పదవి

మహబూబాబాద్ తొలి ఎస్టీ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి గెలిచిన పోరిక బలరాంనాయక్‌ను సోనియమ్మ కేంద్ర మంత్రి చేశారని, ఈసారి కూడా ఆయన్ను గెలిపిస్తే అంతకన్న పెద్దస్థాయి పదవి ఆయనకు దక్కుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇరుగు, పొరుగున ఉన్న మహబూబాబాద్, ఖమ్మం ఎంపీ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ ఇవ్వడంలో గట్టి పోటీ నెలకొందని రేవంత్‌రెడ్డి అన్నారు. బలరాంనాయక్‌కు 3లక్షలకు తగ్గకుండా మెజారిటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇందుకు అందరు సిద్ధమేనా అంటూ పదే.. పదే ప్రశ్నిస్తూ సభీకుల నుంచి ఔననే సమాధానం చెప్పించారు. రేవంత్ ప్రసంగం ఆసాంతం కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, యశస్విని‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌చౌదరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, రాములునాయక్, పొదెం వీరయ్య, బెల్లయ్యనాయక్, మాలోతు నెహ్రూనాయక్, రవీంద్రనాయక్, రియాజ్, భూక్య ఉమా, నూనావత్ రాధ, మోహన్‌లాల్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిప్పకూడు తినడం ఖాయం

- ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారనడం అవివేకం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 19 : సీఎం రేవంత్‌రెడ్డిని లిల్లిపుట్ అంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిప్పకూడు తినే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కోరుతూ స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీ నాయక్ అధ్యక్షతన 'జన జాతర' సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి పోతున్నారని, మంత్రి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని పోరం బోకు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో ఫోన్‌ట్యాపింగ్ చేయడం దౌర్భాగ్యమని ప్రతిపక్ష నేతలు కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఫోన్ ట్యాపింగ్ చేయడం దారుణమన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌లో పాలుపంచుకున్న వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. రూ.10 లక్షల కోట్ల నిధులు తెలంగాణకు ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని, తెలంగాణ నుంచి కేంద్రానికి రూ.లక్షల కోట్ల శిస్తుకట్టలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి నాలుగు సీట్లు కూడా రావన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

రోల్ మోడల్ సీఎంగా రేవంత్‌రెడ్డి..

- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాష్ట్రంలో వందరోజుల పాలనలో ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను అమలు చేస్తూ దేశంలో రోల్‌మోడల్ సీఎం రేవంత్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒకడు మూడునెలలు, మరొకడు ఆరునెలలు ఉంటుందని మాట్లాడు తున్నారని ఇది సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలోనే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశారని చెప్పారు. ప్రజలకు సేవచేయాలనే పట్టుదలతో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సోనియా గాంధీ ఆశీస్సులు, రాహుల్‌గాంధీ దీవెనలతో పోరిక బలరాం నాయక్ కేంద్రమంత్రిగా పని చేశారని, ఆయన్ను గెలిపించుకుంటే మళ్లీ ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడతారని చెప్పారు. మాను కోట పార్లమెంటరీ నియోజకవర్గంలో బలరాంనాయక్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


బలరాం నాయక్‌కు నామినేషన్ ఫీజును అందజేస్తున్న అడ్వకేట్ విఠల్‌రావు

నామినేషన్ ఫీజు అందజేత

కామేపల్లి, ఏప్రిల్ 19: కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కు కామేపల్లికి చెందిన న్యాయవాది బోడేపూడి విఠల్‌రావు నామినేషన్ రుసుంను అందజేశారు. బలరాం నాయక్ శుక్రవారం మహబూబాబాద్‌లో నామినేషన్ వేయగా, ఉదయమే నామినేషన్ ఫీజును అందజేశారు. ఈ సందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ బలరాం నాయక్ పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో అఖండ విజయం సాధించాలని కోరుతూ ఆయన నామినేషన్ ఫీజు రూ, 12,500 అందజేసినట్లు తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానున్నదని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నేతలు కృష్ణారెడ్డి, హనుమంతరావు, రామచందర్, బత్తుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి తాండ్ర నామినేషన్

- వెంట వచ్చిన పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఇతర నేతలు
- ఖమ్మంలో విజయం ఖాయమని ధీమా

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 19: నామినేషన్ల ఘట్టం రెండోరోజు శుక్రవారం ఒక నామినేషన్ దాఖలైంది. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తన నామినేషన్‌ను కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్‌కు అందజేశారు. దీంతో ఇప్పటివరకు రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. నామినేషన్‌తోపాటు వినోద్‌రావు 34పేజీలతో అఫిడవిట్‌ను అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, దొంగల సత్యనారాయణ తదితరులు వచ్చారు. అనంతరం రిటర్నింగ్ అధికారి గౌతమ్ తాండ్ర వినోద్‌రావుతో ప్రమాణం చేయించారు. తర్వాత ఆయన నామినేషన్‌ను అధికారులు పరిశీలించారు.

ఖమ్మంలో బోణీ కొట్టబోతున్నాం...

'ఖమ్మంలో బీజేపీ తొలిబోణి కొట్టబోతోంది.. దేశవ్యాప్తంగా 400సీట్లు గెలుచుకుని మళ్లీ ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ సాధించనున్నట్లు బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఖమ్మం బీజేపీ అభ్యర్థిగా వినోద్‌రావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఖమ్మంలో బోణీ కొట్టబోతున్నామని, దేశవ్యాప్తంగా ఊహించని ఫలితాలు చూడబోతున్నామని 400పై చిలుకు ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందనున్నట్లు తెలిపారు. దీనిలో ఖమ్మం స్థానం ఒకటన్నారు. త్వరలో దేశంలో హ్యాట్రిక్ పీఎంగా మోదీ తిరిగి బాధ్యతలు చేపట్టబోతున్నారన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తామని, ఇన్నాళ్లు పార్లమెంట్‌ను అడ్డుపెట్టుకొని కోట్లకు పడగలెత్తిన వారికి చెంపపెట్టులా బీజేపీ విజయం ఉండాలని వారు కోరారు.

సొంత వాహనం కూడా లేదు..

కుటుంబ ఆస్తులు రూ. 16.23 కోట్లు

ఖమ్మం, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోదరావు, ఆయన సతీమణి వినీల పేరుమీద సొంత వాహనాలే లేవు. ఆయన భార్యకు ఉన్న బంగారు ఆభరణాల కంటే ఆయన పేరుమీద బంగారు అభరణాలే ఎక్కువగా ఉన్నాయి. అఫిడవిట్‌లో ఆయన తన, తన సతీమణి పేరుమీద ఉన్న ఆస్తుల వివరాలను వెల్లడించారు. దాని ప్రకారం 2018-19లో ఆయన ఆదాయం రూ. 11.93 లక్షలు కాగా, అది 2022-23 సమయానికి రూ. 54.06 లక్షలకు చేరింది. ఆయన సతీమణి ఆదాయం 2018-19లో రూ. 16.88 లక్షలు ఉండగా, అది 2022-23 సమయానికి రూ. 18.02 లక్షలకు చేరింది. ప్రస్తుతం వారిద్దరి పేరుమీద ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ.16.23 కోట్లు కాగా అందులో ఆయన పేరుమీద 11.65 కోట్లు ఆస్తులు ఉన్నట్టు తెలిపారు. తన భార్యపేరుమీద రూ. 4.58 కోట్లు ఉన్నట్టు పేర్కొన్నారు. తన పేరుమీద ఉన్న మొత్తం ఆస్తుల్లో రూ. 7.04 కోట్లు చరాస్తులు ఉండగా.. వాటిల్లో రూ. 1.90 కోట్లు విలువ చేసే మూడున్నర కిలోల బంగారం, రూ.1.82 లక్షల విలువ చేసే 32.700 గ్రాముల వెండి ఉన్నట్టు తెలిపారు. చేతిలో రూ. 2.82 లక్షల నగదు ఉన్నట్టు తెలిపారు. వాటితోపాటుగా పలు బ్యాంకు అకౌంట్లలో, బాండ్ల రూపంలో నగదు పెట్టినట్టు చూపించారు. ఆయన సతీమణి వెన్నెల పేరుమీద రూ. 1.68 కోట్లు చరాస్తులు ఉండగా వాటిల్లో రూ. 1.92 కోట్లు విలువ చేసే 3.261 కిలోల బంగారం ఉన్నట్టు, రూ.19.66 లక్షల విలువ చేసే 29.800 గ్రాముల వెండి ఉన్నట్టు తెలిపారు. ఆమె చేతిలో రూ. 1.12 లక్షల నగదు రూపంలో ఉన్నట్టు పేర్కొన్నారు. వినోదరావు పేరుమీద రూ. 3.42 లక్షల అప్పులు ఉన్నట్టు తెలిపారు. ఇక ఆయన 1995లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్, 2001లో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసినట్టు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పరిశీలకుడు అరుణ్‌ప్రసాత్ కృష్ణస్వామి

లెక్క పక్కాగా..

- ఎన్నికల వ్యయ పరిశీలకులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 19: లోక్‌సభ సాధారణ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు అభ్యర్థుల ఖర్చులను కచ్చితంగా నమోదు చేయాలని ఖమ్మం లోకసభ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యయ పరిశీలకులు, ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ లతో కలిసి ఖర్చు నిఘా బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని తెలిపారు. డబ్బు, మద్యం, ప్రలోభాల రహిత ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతాలపై నిఘా ఉంచాలన్నారు.

ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయన్నారు. 24 ఫ్లయింగ్ స్క్వాడ్, 45 ఎస్ఎస్టీ టీములు ఏర్పాటుచేసి పటిష్ఠ నిఘా పెట్టినట్లు తెలిపారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి సి-విజిల్, 1950 టోల్ ఫ్రీ ఫిర్యాదుల పరిష్కారం, నిఘా బృందాల పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. సువిధ సింగిల్ విండో ద్వారా ఎన్నికల అనుమతులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

మతిస్థిమితంలేని వివాహిత కుటుంబ సభ్యులకు అప్పగింత

» మహారాష్ట్ర వెళ్లి అప్పగించిన అన్నం శ్రీనివాసరావు



కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంఖానాపురంహవేలీ, ఏప్రిల్ 19: మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన సయ్యద్ నస్రీన్‌ను శుక్రవారం అన్నం శ్రీనివాసరావు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. 8నెలల క్రితం ఖమ్మం నగరంలో మతిస్థిమి తం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతున్న మహిళను స్థానికుల సమాచారం మేరకు నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్‌కు తరలించారు. వైద్యసేవల అనంతరం ఆమె ద్వారా వివరాలు సేకరించి, మహారాష్ట్రలోని షోలాపూర్‌లో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారని తెలిపింది. వీరి కుటుంబం అత్యంత పేదరికంలో ఉండటంతో ఖమ్మం వచ్చేందుకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాలేక పోతున్నామని చెప్పటంతో అన్నం ఫౌండేషన్ అంబులెన్స్ ద్వారా ఆమెను మహారాష్ట్రలోని షోలాపూర్‌లోని స్వగృహానికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు అన్నం శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ కారు అద్దం పగలగొట్టిన వ్యక్తి పై కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 19: పోలీస్ పెట్రో కారు అద్దం పగలగొట్టిన వ్యక్తి పై ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ నందు కేసు నమెదు అయింది. ఖమ్మం నగరంలోని పొదిల లక్ష్మయ్య నగర్‌లో గొడవ జరుగుతుందని డయల్-100కు ఈనెల 12న ఫోన్ రావడంతో పోలీసులు పెట్రో కారులో అక్కడికి వెళ్లారు. అక్కడ మంకిన ఆదిలక్ష్మి, స్రవంతి, నాగమణిలతో అదే ప్రాంతానికి చెందిన చిర్రా శివాజీ అనే వ్యక్తి మద్యం మత్తులో గొడవపడుతున్నాడు. పోలీసులు అతడిని ఆపెందుకు ప్రయత్నం చెసినప్పటికి వినకుండా కారు అద్దం పగలగొట్టి అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో పోలీసులు శివాజీ పై కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

80 లీటర్ల నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం ఏప్రిల్ 19: మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో సుజ్ఞానపురానికి చెందిన నలుగురు వ్యక్తుల వద్ద రూ.24వేల విలువగల ఎనభై లీటర్ల నాటుసారాను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీతానగరం గ్రామం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులకు భూక్యా బాబూరావు, భూక్యా సాంబలు నలభై లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డారు. అలాగే పెద్దనల్లబల్లి సెంటర్లో తనిఖీలు చేస్తున్న పోలీసులకు అజ్మీరా నాగేశ్వరావు, అజ్మీరా శ్రీకాంత్‌లు మరో నలభై లీటర్ల నాటుసారాతో దొరికారు. పై నలుగురిపై ఎస్ఐ గణేష్, ఎస్ఐ కేశవరావులు వేర్వేరుగా కేసులు నమోదు చేయడంతోపా టు రవాణాకుపయో గిం చిన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నా రు.

మూడుగ్రామాల దాహార్తిని తీరుస్తున్న మినీ స్కీం

» 1994-95లో అప్పటి ఎమ్మెల్యే బోడేపూడి సహకారంతో విప్పలమడక సర్పంచ్ మేడా శంకరయ్య ఆధ్వర్యంలో అంకురార్పన

వైరా, ఏప్రిల్ 19: గత పుష్కరకాలంలో ఎన్నడూ లేనివిధంగా భూగర్భజలాలు అడుగంటిపోయి తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒక చిన్నతరహా మంచినీటి పథకం మూడు గ్రామాల దాహార్తిని తీరుస్తుంది. దాదాపు 25సంవత్సరాలుగా ఈ మినీ స్కీం నుంచి నిత్యం 20వేల పైచిలుకు లీటర్ల తాగునీటిని మూడు గ్రామాల ప్రజలకు సరఫరా చేస్తుంది. మిషన్ భగీరథ నుంచి అరకొరగా సరఫరా అవుతున్న నీటిని ఈ గ్రామాల ప్రజలు ఏమాత్రం ఉపయోగించుకోవడం లేదు. విప్పలమడక గ్రామస్థులు మొత్తం ఈ మినీ స్కీంకు చెందిన నీటినే తాగునీటిగా వాడుకుంటున్నారు. అది కూడా ఎలాంటి శుద్ధి చేయకుండానే నేరుగా వినియోగిస్తున్నారు. ఈ నీటిలో అవసరమైన మినరల్స్ పుష్కలంగా ఉన్నాయని వారి ప్రగాఢ విశ్వాసంగా ఉంది.

ఖమ్మంజిల్లా వైరా మండలంలోని విప్పలమడకలో ఉన్న మినీ మంచినీటి స్కీం ఈ వేసవి కాలంలో విప్పలమడక, నారపనేనిపల్లి, లింగన్నపాలెం గ్రామాల ప్రజలకు వరప్రసాదంగా ఉంది. 1994-95 ప్రాంతంలో అప్పటి ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు సహకారంతో నాటి సర్పంచ్ మేడా శంకరయ్య పంచాయతీ పాలకవర్గం, గ్రామపెద్దలు మినీ మంచినీటి స్కీంకు అంకురార్పణ చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ మినీ స్కీం పనిచేస్తుంది. 1995 తర్వాత సర్పంచ్ అయిన గరిడేపల్లి వెంకటేశ్వర్లు కూడా ఈ మంచినీటి స్కీం నిర్వహణకు తనవంతు కృషిచేశారు. 1998-99 ప్రాంతాల్లో ఎమ్మెల్యేలుగా పనిచేసిన కట్టా వెంకటనర్సయ్య, కొండబాల కోటేశ్వరరావు కూడా స్కీం నిర్వహణకు తమవంతు సహకారాన్ని అందించారు. గ్రామస్థులు సేకరించిన స్థలంలో ఒక మంచినీటి బావిని నిర్మించి సమీపంలో ఒక బోర్‌ను ఏర్పాటుచేసి మోటారు నుంచి బావిలోకి నీటిని పంపించటం ద్వారా గ్రామప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేవిధంగా ఈ పథకాన్ని ఏర్పాటుచేశారు. అయితే 2013లో సర్పంచ్ అయిన పారుపల్లి కృష్ణారావు ఈ బావి వద్ద రెండు ట్యాంకులు నిర్మించి ప్రజలు నేరుగా ఈ ట్యాంకుల నుంచి నీరు పట్టుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే తాజా మాజీ సర్పంచ్ తుమ్మల జాన్‌పాపయ్య హయాంలో కూడా ఈ మినీస్కీంను సమర్థవంతంగానే నిర్వహించారు. ఈ ట్యాంకులు ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్నాయి. గత ప్రభుత్వ



ట్యాంకుల నుంచి క్యాన్లకు తాగునీటిని పట్టుకుంటున్న ప్రజలు

హయాంలో మిషన్ భగీరథ నుంచి గ్రామాలకు నీటికి సరఫరా చేస్తున్నందున ప్రతి గ్రామంలోని మినీ స్కీంలను మూసివేయాలని, ఎలాంటి కరెంట్ బిల్లులు చెల్లించొద్దని ఆదేశించింది. అయితే విప్పలమడక మినీ స్కీంకు మాత్రం ఇతర మార్గాల ద్వారా సమకూర్చుకున్న ఆదాయం ద్వారా ఈ మినీ స్కీంకు కరెంట్‌బిల్లులు చెల్లిస్తూ యథావిధిగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఇప్పుడు ఈ మినీ స్కీం తాగునీటి అవసరాలకు ఎంతో దోహదపడుతుంది. ఒక మోటారు నుంచి మంచినీటిని నేరుగా మినీ ట్యాంకుల్లో నింపి ఆతర్వాత అదనంగా ఉన్న నీటిని బావిలోకి విడుదల చేస్తున్నారు. అలాగే మరో మోటారు నుంచి వచ్చే నీటిని మిషన్ భగీరథ నీటితో కలిపి గ్రామంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు నింపి ఆతర్వాత అదనంగా ఉన్న నీటిని బావిలోకి వదులుతున్నారు. ఈ మినీస్కీం ద్వారా చుక్కనీరు కూడా వృథా కాకుండా మిగిలిన నీటిని బావిలోకి వదులుతున్నారు. ఫలితంగా భూగర్భజలాలు నిండుగా ఉంటున్నాయి. విప్పలమడక ప్రజలు నిత్యం 15వేల లీటర్ల తాగునీటిని ఈ స్కీం నుంచి పొందుతున్నారు. అలాగే నారపనేనిపల్లి, లింగన్నపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు కూడా నిత్యం ఐదారువేల లీటర్ల మంచినీటిని ఈ స్కీం నుంచి తీసుకువెళ్తున్నారు. గ్రామపంచాయతీ సెక్రటరీ వేము రామకృష్ణ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది ఈ మినీ స్కీంను విజయవంతంగా నడుపుతున్నారు. ఫలితంగా మూడు గ్రామాల ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి లేకుండా ఉంది.

రాష్ట్ర సరిహద్దు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

» రాష్ట్ర సరిహద్దులో ఉంటూ ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్న రెండు రాష్ట్రాల ఉద్యోగులు: యూటీఎఫ్

మధిర, ఏప్రిల్ 19: తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివాసముంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జీవి నాగమల్లేశ్వరరావు రెండు రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సరిహద్దులో నివాసముంటే ఎంతో కాలంగా ఓటు వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నివాసం తెలంగాణలో ఉద్యోగం ఏపీలో..

శుక్రవారం మధిరలో మండల కార్యదర్శి ఏ వినోదరావు అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంత పట్టణాల్లో నివాసముంటూ అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగం చేస్తున్నారని వారిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నవారికి ఎన్నికల్లో ఓటు వేసే వెసులుబాటు లేక ఓటు వేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని, మధిరలాంటి సరిహద్దు పట్టణాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. మధిర పట్టణంలో నివాసముంటూ అనేక మంది సరిహద్దు ఏపీలో విధులు నిర్వహిస్తున్నవారు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో వీరి ఓటు వినియోగం విషయంలో గందరగోళం నెలకొందన్నారు. కుటుంబ అవసరాల రీత్యా, స్థానికత రీత్యా అనేక మంది ఏపీ ఉద్యోగులు సరిహద్దు పట్టణమైన మధిరలో నివసిస్తున్నారని తెలిపారు.

నివాసం ఏపీలో ఉద్యోగం తెలంగాణలో..

అలాగే మధిర సరిహద్దు ప్రాంతాలైన ఏపీ రాష్ట్రంలోని తునికిపాడు, శివాపురం, జొన్నలగడ్డ తదితర గ్రామాల్లో స్థానికులైన ఉపాధ్యాయులు ఉద్యోగరీత్యా తెలంగాణ రాష్ట్రంలోని మధిర మండలంలో పనిచేస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

వీరి ఓటు విషయంలో కూడా అదే విధంగా గందరగోళం నెలకొందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులు నియోజకవర్గ కేంద్రంలోని రిటర్నింగ్ ఆఫీసర్ వద్దకు వెళ్లి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివుంటుందని, పనిచేసే మండలంలో లేదా నివాసం ఉంటున్న మండలంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12బీ సమర్పించే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర విభజన అనంతరం ఎన్నికల సమయాల్లో సరిహద్దుల్లో ఉంటున్న అనేక మంది ఇలాంటి సమస్యను ఎంతోకాలంగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో ఓటు వినియోగించుకోలేకపోయారని అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా రెండు రాష్ట్రాల ఎన్నికల అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ వినోదరావు, ఈ వీరయ్య, ఉపాధ్యక్షులు ఇబ్రహీం, కోశాధికారి చెన్నయ్య, రాణి, కళావతి, కొండలరావు, మల్లరాజు, భీమశంకర్‌రావు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 19: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం (ఉమ్మడి జిల్లా) సీనియర్ ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియే షన్ కార్యదర్శి కళ్యాణపు ఆదర్శ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి ఈనెల 27 నుంచి మార్చి 30 వరకు గోదావరిఖనిలో జరిగే 10వ రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల ఖమ్మం, భద్రాద్రి జిల్లాల క్రీడాకారులు తమ జనన ధృవీకరణ, ఆధార్, పాస్‌పోర్టు ఫొటోతో ఉదయం 8.30 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9989647696 నెంబరును సంప్రదించాలని కోరారు.

28 నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 19: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు రాయల నారాయణ మెమోరియల్ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీల పోస్టర్‌ను వారు ఆవిష్కరిం చారు. నగరంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలలో కరీంనగర్, నిజా మాబాద్, వరంగల్, కొత్తగూడెం, మంచిర్యాల, నల్గొండ, పాల్వంచ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులను ఆహ్వానించామని తెలిపారు. పోటీల మొదటి రోజు పురుషులు, మహిళల విభాగాలలో సింగిల్స్, డబుల్స్ పోటీలు జరుగుతాయని, అనంతరం అండర్-10, 11, 13, 15, 17, 19 బాలుర, బాలికల విభాగాలలో పోటీలు జరుగుతాయని వారు తెలిపారు. పోటీలలో విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌తో పాటు నగదు బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు ఇతర సమాచారం కోసం 9848408335 నెంబరును సంప్రదించాలని కోరారు.

సీఎం రేవంత్ దృష్టికి ఇల్లెందు సమస్యలు

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 19: ఇల్లెందు నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం ఇల్లెందు నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను సీఎంకు వివరించారు. వేసవీ కాలంలో నెలకొని ఉన్న తాగునీటి ఎద్దటితో పాటు ఇతర ప్రజాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని విన్నవించారు.



సీఎంని ఆలింగనం చేసుకుంటున్న కోరం

అతివేగంగా వస్తూ లారీని ఢీకొన్న కారు

● ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సును తప్పించిన లారీ డ్రైవర్

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 19: అతివేగంగా వచ్చిన కారు లారీనీ ఢీకొట్టుకుంటూ వెళ్లి ఓ కరెంట్ స్థంబాన్ని ఢీకొట్టిన సంఘటన శుక్రవారం నగరంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం రాపర్తినగర్ వైపు నుంచి ఓ కారు అతివేగంగా వస్తూ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద పక్క నుంచి లారీ ఢీకొట్టింది. అదే సమయంలో పెట్రోల్ బంక్ ఎదురుగా ఓస్కూల్ బస్సు రోడ్డుదాటుతుండడంతో లారీ డ్రైవర్ చాకచక్యంగా దానిని తప్పించాడు. దీంతో కారు పక్కనే ఉన్న కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. కొద్దిసేపు కరెంట్‌కు అంతరాయం కలిగింది. కాగా రోడ్డు క్రాస్ చేస్తున్న స్కూల్ బస్సులో పిల్లలు కూడా ఉన్నారు. పిల్లలను స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్ ఆటోలలో ఎక్కించి వారిని స్కూల్‌కు తరలించారు. లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పిల్లలు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

40బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మధిరరూరల్, ఏప్రిల్ 19: మధిర మండలం మాటూరు వద్ద అక్రమంగా తరలిస్తున్న 40బస్తాల రేషన్ బియ్యాన్ని మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను నుంచి మాటూరు గ్రామం మీదుగా జయంతి గ్రామానికి రెండు వాహనాల్లో 40 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. మధిర మండలం మాటూరు కాలనీ సమీపంలో పోలీసులు ఈ బియ్యాన్ని పట్టుకుని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 19: తాటిచెట్టుపై నుంచి వ్యవసాయ బావిలోపడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన తిరుమలాయపాలెం మండలంలో జరిగింది. మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన మల్లారపు వెంకన్న(55) కల్లు గీత కార్మికుడుగా జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సమీప గ్రామం చంద్రుతండాలో తాటికల్లు తీసేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. ఈప్రమాదంలో వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సహకారంతో వెంకన్న మృతదేహాన్ని వెలికి తీశారు. వెకన్నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లారీ ఢీకొని భవన కార్మికుడి దుర్మరణం

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 19: ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి లారీ ఢీకొని ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘనట శుక్రవారం నగరంలో జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటయపాలేనికి చెందిన మెట్టు రాములు (51) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. తన బంధువు సంపత్ ద్విచక్రవాహనంపై నగరంలోని టేకులపల్లి వద్ద సుతారి పని చేసేదుకు శుక్రవారం ఉదయం ఇద్దరు వస్తున్నారు. తర్వాత ఎన్టీఆర్ సర్కిల్‌లో గ్రీన్‌సిగ్నల్ పడడంతో ద్విచక్రవాహనంనపై బయలుదేరిన వారిని వెనుకనుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో కిందపడిన రాములపై లారీ టైర్ ఎక్కడంతో తీవ్రగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అదే ద్విచక్రవాహనంపై ఉన్న సంపత్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ఆసుపత్రి మార్చురికి తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.



రాములు (ఫైల్)

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 19: కుమార్తెను అల్లుడు అత్తగారింటికి తీసుకెళ్లకపోవడంతో మనస్థాపంతో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం గుట్టల బజార్‌లో నివసించే అప్పికట్ల వెంకటేశ్వరరావు(59) స్వర్ణకారుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఒక కుమార్తె, కుమారుడున్నా రు. కుమార్తెను కొంతకాలం క్రితం గార్ల మండలం పోచారానికి చెం దిన ఓ యకువడికి వచ్చి వివాహం చేశారు. నాలుగేళ్ల క్రితం భార్యను అతను పుట్టింట్లో వది లేసి వెళ్లాడు దీనిపై వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. తర్వాత న్యాయ స్థానంలో మనోవర్తికోసం వాజ్యం దాఖలు చేశాడు. అల్లుడు స్పందించ కపోవడంతో మనస్తాపం తో వెంకటేశ్వరరావు ఇటీవల పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు ఈఘటనపై మృతుని కుమార్తె అంబిక ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ఇరవై ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం

గుండాల, ఏప్రిల్ 19: అడవిలో నుంచి నిప్పు ఎగసిపడి పక్కనే ఉన్న చేనులో పడటంతో పలువురు రైతులకు చెందిన ఇరవై ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగ దగ్ధమైన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఊకె చిన పగడయ్య, జోగ సారయ్య, జోగ రవీందర్, పెండెకట్ల పెంటయ్య, ఊకె సారయ్య అనే రైతులు ఈ ఏడాది యాసంగిలో ఇరవై ఎకరాల మొక్కజొన్న సాగు చేశారు. పంట చేతికొచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న అడవి కాలుతూ నిప్పులు ఎగసిపడి మొక్కజొన్న చేనులో పడటంతో చేనంతా కాలిపోయింది. సమాచారం అందుకున్న రైతులు చేను వద్దకు వచ్చేసరికి చేనంతా కాలిపోయింది. సుమారు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

11 ద్విచక్రవాహనాల సీజ్

పాల్వంచ, ఏప్రిల్ 19: పాల్వంచ పట్టణ పోలీసులు బుల్లెట్ ద్విచక్రవాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ వాహనాలకు కంపెనీ నుంచి వచ్చే సైలెన్సర్లను మార్చి శబ్దం ఎక్కువగా వచ్చే సైలెన్సర్లను బిగించుకుని శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తున్నారని అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సైలెన్సర్లను మార్చిన 11 బుల్లెట్ వాహనలను గుర్తించి, మార్చిన సైలెన్సర్లను తీసివేసి వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మోటర్ వెహికల్ యాక్టు ప్రకారం జరిమానాలను విధించామని టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవర్ హల్‌చల్

● ట్రాలీ ఆటో, బైక్, విద్యుత్ స్తంభాలను ఢీకొన్న కారు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 19: సత్తుపల్లి పట్టణంలో ఓ వ్యక్తి కారుతో హల్‌చల్ సృష్టించాడు. ఖమ్మం వైపు నుంచి వేగంగా వస్తున్న కారు స్థానిక పాతసెంటర్‌లోని కాకర్లపల్లి రోడ్డుకు చేరుకోగానే ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనాలను ఢీకొన్నాడు. అంతటి తో ఆగకుండా విద్యుత్ స్తంబాన్ని ఢీకొట్టడంతో ఆగింది. లేకుంటే ఫుట్‌పాత్‌పై ఉన్న కూరగాయాల దుకాణం, బాటసారుల పైకి వెళ్లినట్లయితే ప్రాణాపాయం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళకు తీవ్రగాయాలవ్వగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిం చారు. మద్యం మత్తులో సదరు వ్యక్తి ఉన్నాడని, కారును అజాగ్రత్తగా నడుపుతూ రెండు వాహనా లతో పాటు స్తంబాన్ని ఢీకొట్టినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీ సులు సంఘ టనా స్థలానికి చేరుకుని వాహనాలను తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించి కారు, వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

కామేపల్లి, ఏప్రిల్ 19: నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన ముచ్చర్లలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జాలె శివ మధ్యాహ్నం సమయంలో తన పంట చేను వద్దకు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి బైక్‌ను చేను సమీపంలో నిలిపాడు. పని ముగించుకొని రెండు గంటల తర్వాత ద్విచక్రవాహనం వద్దకు వచ్చి చూడగా అగ్నికి పూర్తిగా కాలి బూడిదై ఉంది. ద్విచక్ర వాహనం కొని ఏడాది కూడా గడవకముందే ఎండ వేడిమీ, మంటలు కారణంగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.



దగ్ధమైన ద్విచక్రవాహనం

అక్రమంగా నిల్వ ఉన్న మద్యం పట్టివేత

కల్లూరు, ఏప్రిల్ 19: కల్లూరు పట్టణంలోని పుల్లయ్యబంజరు విధివైపున గల ఓ బెల్ట్‌షాపతో పాటుగా పడమట లోకవరం గ్రామంలో గల మరో బెల్ట్‌షాపులో ఫ్లాయింగ్ స్వాడ్ బృందం శుక్రవారం దాడులు నిర్వహించి రూ.10,500 విలువ గల మద్యాన్ని పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా మద్యం నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి ముగ్గురిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని మండల ఫ్లాయింగ్ స్కాడ్ అధికారి ప్రభాకరరావు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ అధికారులు, ఫ్లాయింగ్ స్కాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ దారుణహత్య

మృతుడు ఏపీలోని అల్లూరి జిల్లా కన్నాయిగూడెం ఎంపీటీసీ

దుమ్ముగూడెం ఏప్రిల్ 19: మండలంలోని రామారావుపేటకు చెందిన వర్సా బాలకృష్ణ(39) గురు వారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. బాలకృష్ణ సుమారు పద్నాలుగేళ్ల క్రితం మండల సరిహద్దు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి జిల్లా ఎటపాక మండలం కన్నాయిగూడేనికి చెందిన యువతిని వివాహం చేసుకొని ఆ గ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. వైసీపీ నుంచి ఎంపీటీసీగా గెలిచి ప్రజాప్రతినిదిగా వ్యవహరిస్తున్నాడు. కన్నాయిగూడేనికి చెందిన ఒక వ్యక్తి, భద్రాచలానికి చెందిన మరో వ్యక్తి మాట్లాడే పనిఉందని గురువారం అర్ధరాత్రి బాలకృష్ణను భద్రాచలం- చర్ల ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిపై కన్నాయిగూడెం గ్రామ శివారుకు పిలిచారు. అనంతరం రహదారి పక్కనే బాలకృష్ణను బండరాయితో తలపై మోది అతి కిరాతకంగా హత్య చేశారు. హంతకులు ఈ హత్యకు ముందుగానే పథకం వేసుకున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. హత్యకు పథకం పన్నిన వ్యక్తులు గురువారం రోజంతా పలుమార్లు మాట్లాడే పనుందని బాలకృష్ణకు ఫోను చేసినట్లు తెలుస్తోంది. ఒక వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్న బాలకృష్ణను దారిలో అటకాయించి హత్య చేసినట్లు సమాచారం. కాగా హత్యకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో వెంటనే లొంగిపోయారు. హత్యకు వ్యక్తిగత కక్షలే కారణమని తెలుస్తోంది. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హత్య ఆరోపణ ఎదుర్కొంటున్న కన్నాయిగూడెం నిందితుని ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం. హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై ఆదివాసీ సంఘాలు రాస్తారోకో చేశారు. సంఘటనా స్థలాన్ని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా, సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారధిలు పరిశీలించారు. మృతదేహాన్ని అమ్మమ్మ గారి ఊరైన దుమ్ముగూడెం మండలం మారేడుబాకకు తరలించారు. మృతుడు బాలకృష్ణ నరసాపురం తాజా మాజీ సర్పంచ్ వర్సా శివరామకృష్ణకు స్వయంగా సోదరుడు. బాలకృష్ణ మృతితో మారేడుబాకలో విషాదచాయలు అలుముకున్నాయి.



బాలకృష్ణ (ఫైల్)

ఏపీలో జరిగిన హత్యకేసులో నిందితుడి అరెస్టు

● ఏపీ పోలీసులకు అప్పగించిన వైరా పోలీసులు

వైరా, ఏప్రిల్ 19: వైరా మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన సాధం రామకృష్ణ అనే వ్యక్తిని వైరా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలం గంటి గ్రామంలో భార్య తరఫు బంధువైన అమ్మమ్మ గంటాలమ్మను దారుణంగా హత్య చేశాడు కొత్తపేట పోలీసుల సమాచారం మేరకు నిందితుడైన రామకృష్ణను అదుపులోకి తీసుకొని కొత్తపేట పోలీసులకు అప్పగించారు గతంలో రెండు సంవత్సరాల క్రితం భార్యపై అనుమానంతో సొంత సోదరుడైన వికలాంగుడు నరేష్‌ను హత్య చేసిన కేసులో శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చిన రామకృష్ణ అనంతరం తూర్పుగోదావరి జిల్లాలోని కొత్తపేట గ్రామంలో భార్య తరఫు బంధువుల ఇంటికి నిప్పు పెట్టిన హత్యాయత్నం కేసులో తిరిగి జైలుకు వెళ్లి పై ఈనెల 16న విడుదలై భార్య తరఫు బంధువులైన అమ్మమ్మ గంటాలమ్మను గొంతు కోసి హత్య చేసి. తిరిగి స్వగ్రా మమైన రెబ్బవరం చేరుకున్నాడు. ఏపీ పోలీసుల సమాచారం మేరకు రామకృష్ణను వైరా ఏసీపీ రెహమాన్ సీఐ సాగర్ ఆదేశాల మేరకు ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ రెబ్బవరం గ్రామంలో నిందితుడైన రామకృష్ణను అదుపులోకి తీసుకొని కొత్తపేట పోలీసులకు అప్పగించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిదిమందికి గాయాలు

జూలూరుపాడు/దుమ్ముగూడెం/కరకగూడెం/మణుగూరు, ఏప్రిల్ 19: మండలంలోని గుండెపూడి గ్రామంలో శుక్రవారం ట్రాలీ ఆటో అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న కందకంలోకి దూసుకెళ్లడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. చత్తీస్‌గడ్‌కి చెందిన వలసకూలీలు మిర్చికోతల పనుల కోసం గత కొన్ని రోజుల క్రితం జూలూరుపాడు మండలంలోని గుండెపూడి గ్రామానికి వచ్చారు. పనులు ముగియడంతో ఇళ్లకు వెళ్లేందుకు ట్రాలీ ఆటోలో చత్తీస్‌గడ్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో రహదారి పక్కన కందకంలోకి తీసుకెళ్లింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న చత్తీస్‌గడ్‌కు చెందిన కావస్సి అనిత, పొడియం సునిత, పద్దం రాణిలకు గాయాలయ్యాయి. అదేవిధంగా రహదారి పక్కన ఉన్న మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం గుంపెలగూడెం గ్రామానికి చెందిన ఓర యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. అతనికి మెరుగైన వైద్యం అందించేందుకు ఖమ్మం తరలించారు. కూలీలు ముగ్గుర్ని జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

దుమ్ముగూడెం: మండల పరిధి సీతారాంపురం ఆర్అండ్‌బీ ప్రధా న రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదు రుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. కెగంగోలు కు చెందిన కల్లూరి సందీప్‌కు తీవ్రగాయాలవగా, ఏపీ రాష్ట్రం కుక్కునూరు మండలం పెదరాయిగూడెంకు చెందిన సతీష్ సైతం గాయపడ్డాడు. క్షత గాత్రులిరువురినీ 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం: మండలంలోని రేగళ్ళ పంచాయితీలోని కరకగూడెం ఆళ్ళపల్లి రహదారకిపై శుక్రవారం ద్విచక్ర వాహనం క్రింద పడటంతో ఆళ్ళపల్లి పంచాయితీ అనంతోగు గ్రామానికి గలిక లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్థులు 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



కరకగూడెంలో గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మహిళకు గాయాలు

మణుగూరు: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్కూటీపై వస్తున్న మహిళ వైపునకు చిన్నరావిగూడెం నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ అకస్మాత్తుగా రావడంతో స్కూటీ లారీ కింద కు వెళ్లిపోయింది. దీంతో ఈ వాహనాన్ని నడిపే పగిడేరుకు చెందిన మహిళకు గాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షత గాత్రురాలిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య సేవలందిస్తున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

● రివార్డు అందజేసిన ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 19: మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు దళసభ్యులు శుక్రవారం ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట లొంగిపోయారు. వాజేడు మండలం ప్రగళ్లపల్లికి చెందిన పుల్లూరు నాగరాజు అలియాస్ జగత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన నుప భీమా అలియాస్ సంజు, ముచకి దుల్లో అలియాస్ సోనీ జనజీవన స్రవంతిలో కలిశారు. వారికి ఎస్పీ శబరీశ్ రివార్డు మొత్తాన్ని అందజేశారు. కాలంచెల్లిన సిద్ధాంతాలతో అడవుల్లో ఉంటూ పోరాటం చేయడాన్ని మానుకుని కుటుంబసభ్యులతో అమూల్యమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ మావోయిస్టులకు సూచించారు. ప్రభుత్వం పునరావాసం కల్పించి తోడ్పాటు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో 39 బెటాలియన్ కమాండెంట్ రాజేష్‌తివారి, డీఎస్పీ రవీందర్ పాల్గొన్నారు.



రివార్డు అందిస్తున్న ఎస్పీ శబరీశ్

వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం: డీవైఎస్‌వో

చుంచుపల్లి, ఏప్రిల్ 19: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించుటకు భద్రాద్రి జిల్లాలోని సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ(ఎస్‌ఏటీఎస్) సహకారంతో జిల్లా యువజన క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 1నుంచి 31వ తేదీ వరకు 14 సంవత్సరాల లోపు బాల, బాలికలకు జిల్లాలో ప్రాచుర్యం పొందిన క్రీడలలో గ్రామీణా ప్రాంతాలలో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాన్ రెసిడెన్షియల్‌గా ఉంటూ సీనియర్ క్రీడాకారులు, జాతీయ స్థాయి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే ఆసక్తి గల వారు తమ ప్రతిభకు సంబంధించిన ధృవపత్రాలను జత చేయాలన్నారు. ఎవరైన ఒక్క క్రీడా విభాగానికి మాత్రమే శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తుమ్మలపై దాడికి కుట్రపన్నిన వారిని శిక్షించాలి

డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య.. కుట్ర యత్నానికి ఖండన

భద్రాచలం, ఏప్రిల్ 19: ప్రజా నాయకుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి కుట్ర పన్ని పథకం రచించడం అమానవీయ ఘటన అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర అన్న వార్తలు చూసి చాలా వేదనకు గురయ్యానని, ప్రజా నాయకుడిగా, ప్రజా సేవకు అంకితమై పని చేస్తున్న సీనియర్ మంత్రివర్యులపై ఇటువంటి పన్నాగాలు రచించిన వారు ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలన్నారు.

దాడికి కుట్రపన్నడం హేయమైన చర్య: ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దాడులకు కుట్ర పన్నడం హేయమైన చర్యని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మంత్రి తుమ్మలపై కుట్ర పన్నారని వార్తలు రావడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ఫోన్ ట్యాపింగ్, వ్యక్తిగత దాడులకు కుట్ర పన్నడంను ఆయన ఖండించారు.

ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి

అజాత శత్రువు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి కుట్ర పన్నిన వారు ఎంతటివారైనా విచారించి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎస్ఏ రసూల్, యశోద రాంబాబు డిమాండ్ చేశారు. తుమ్మల తన రాజకీయ జీవితంలో ఎంతో హుందాగా రాజకీయాలు చేశారని జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత ఆయనదని, అలాంటి నాయకునిపై భౌతిక దాడికి కుట్ర పన్నతిడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

కాంగ్రెస్ నాయకుల ఖండన

దమ్మపేట: ఖమ్మం జిల్లాలో తుమ్మల కాంగ్రెస్ పార్టీలో వుంటే అధికారంలోకి రాలేమని భయంతో బీఆర్ ఎస్‌పార్టీ నాయకులు తుమ్మలపై దాడి చేసేందుకు కుట్రకు తెగబడటాన్ని హేయమైన చర్యగా పలువురు కాంగ్రెస్ నాయకులు అభివర్ణించారు. దురుదపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో సమావేశంలో పామాయిల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, ఎంపీపీ సోయం ప్రాదు, సొసైటి చైర్మన్ ఎల్లిన రాఘవరావు తదితరులు మాట్లాడారు.

కుట్ర నిందితులను శిక్షించాలి

ఇల్లెందు టౌన్: మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో దాడి చేసేందుకు కుట్రపన్ని ప్రయత్నాలు చేసిన వారిని గుర్తించి శిక్షించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కనగాల పేరయ్య, గౌరిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి గత 40 సంవత్సరాల కాలంగా ప్రజల మన్ననలు పొందుతున్న తుమ్మల నాగేశ్వరరావుపై కుట్రపూరితంగా కొంతమంది దుర్బుద్ధితో చేసిన ప్రయత్నాలను బహిర్గతపర్చాలని డిమాండ్ చేశారు.

తుమ్మలకు ప్రజల అండ ఉంది..

ఆళ్లపల్లి: తుమ్మలపై ఎన్ని కుట్రలు, రెక్కిలకు ప్రయత్నాలు చేసిన ఆయనకు రక్షణగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఉన్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనర్సయ్య, పార్టీ సీనియర్ నాయకులు ఎండీ అతహార్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజకీయంలో, ప్రజల్లో అభిమానం పొందిన తుమ్మలను కొందరు ఓర్వలేక దాడికి వ్యూహ ప్రయత్నం చేసే ఆలోచన సిగ్గుచేటు అన్నారు. తుమ్మల సహనాన్ని పరిక్షించవద్దని, ఒక్కసారి తుమ్మల, వారి అభిమానులు కన్నెర్ర చేస్తే మీ జీవితాలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలని హెచ్చరించారు.


ఆళ్లపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బలరాం నాయక్ నామినేషన్‌లో పాల్గొన్న 'పాయం'


నామినేషన్ కార్యక్రమంలో పాయం

మణుగూరు, ఏప్రిల్ 19: మాజీ ఎంపి పోరిక బలరామ్ నాయక్ కాంగ్రెస్ పార్టీ తరుపున మహబూబాబాద్ పార్లమెంటరీ స్థానానికి జరిగే ఎన్నికల్లో శుక్రవారం నామినేషన్ ధాఖలు చేశారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో బలరామ్ నాయక్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమా నికి పినపాక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజర య్యారు. నామినేషన్ ప్రక్రియలో బలరామ్ నాయక్ వెంట ఉన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో యువతకు ఉచిత శిక్షణ

మణుగూరుటౌన్, ఏప్రిల్ 19: మణుగూరు ప్రాంతానికి చెందిన సింగరేణి ప్రభావిత ప్రాంత, సింగరేణి, మాజీ సింగరేణీయుల కుటుంబాల యువతకు, పునరావాస, పరిసర ప్రాంత యువతకు సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులలో ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసారు. కేంద్ర ప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూరిషిప్, తెలంగాణ స్టేట్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూరిషిప్ సహకారంతో 38 కోర్సుల్లో ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించి సదరు హార్డు దరఖాస్తు కాపీని సంబంధిత ధృవపత్రాలు, 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఏరియాలోని పైలట్ కాలనీ ఎంవీటీసీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

గొత్తికోయ గ్రామంలో చేతిబోరు ఏర్పాటు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 19: మండలంలోని దబ్బనూతల కొత్తూరు ఆవాస ప్రాంతం వలస గొత్తికోయ గ్రామం మానుగట్టులో పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేతి బోరును ఏర్పాటుచేశారు. ఏళ్ల తరబడి గొత్తికోయలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటుండాన్ని గుర్తించిన పోలీసుశాఖ ఎట్టకేలకు సదుపాయం కల్పించింది. మారుమూల గ్రామాల ఆదివాసీల సమస్యలు పరిష్కారంలో పోలీసు శాఖ ఎల్లవేళలా ముందుంటుందని సీఐ అశోక్ తెలిపారు.

కట్టు మల్లారంలో విగ్రహ ప్రతిష్ఠ

మణుగూరు, ఏప్రిల్ 19: మణుగూరు మండల పరిధిలోని కట్టు మల్లారం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టా మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ రాధ, స్థానికులు అంతా కలసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేద పండితుల సారధ్యంలో విగ్రహా ప్రతిష్ఠ జరిగింది. గ్రామ కమిటీ పెద్దలు, యువకులు పాలు పంచుకున్నారు.

పీవీ కాలనీలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం


రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరుటౌన్, ఏప్రిల్ 19: మణుగూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పీవీ కాలనీ ఎంసీ క్వార్టర్స్‌లో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంసీ క్వార్టర్‌లలో నివాసముంటున్న ఇళ్లలోని కూలర్లలో నిలువ ఉన్న నీటిని పారబోసారు. ఈ సందర్భంగా కార్మిక కుటుంబాలకు సబ్ యూనిట్ ఆఫీసర్ లింగ్యానాయక్ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఏరియాలోని పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు.

న్యూడెమోక్రసీ విజయానికి కృషి చేయాలి

రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో మహబాద్ నియోజకవర్గం నుంచి న్యూడెమోక్రసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోకాళ్ల మురళీకృష్ణన్ గెలిపించేందుకు అరుణోదయ కళాకారులు కృషి చేయాలని రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇష్టూ కార్యాలయంలో జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీజేపీని ఓడించాలని కోరారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న న్యూడెమోక్రసీ గెలుపు కోసం కళాకారులు కృషి చేయాలన్నారు. తమ కళారూపాల ద్వారా ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అరుణోదయ జిల్లా నాయకులు జనగం వాసు, న్యూడెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కొక్కు సారంగపాణి, మాజీ సర్పంచులు సరోజిని, సంతు, విశ్రీను, అరుణోదయ రాష్ట్ర నాయకులు బొగ్గారపు వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగంటి చిరంజీవి, ఎట్టి నర్సింహారావు, భూక్యా భీ క్షం, లాజర్, జోగా కాంతారావు, అజ్మీర రమణయ్య, బన్సీలాల్, కల్తి రా మ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవునూరి మధు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మండలాధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తొట్టిపంపు గ్రామంలోని పోలింగ్ బూతును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ , త్రాగునీరు, మరుగుదోడ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి ,ఆర్ఐ మదు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 19: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తామని సీఐ జితేందర్‌రెడ్డి తెలిపారు. అశ్వారావుపేటలోని పాత మండల పరిషత్తు కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయం, ఐకేపీ కార్యాలయం, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం రెవెన్యూ అధికారులతో కలిసి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీరాముల శ్రీను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాటు చేయాల్సిన భద్రతపై చర్చించారు. కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద ఇబ్బందులు లేకుండా బందోబస్తును ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి ప్రతిష్ఠ

దమ్మపేట, ఏప్రిల్ 19: దమ్మపేట అర్బన్ కాలనీలో శుక్రవారం ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మతల్లి ప్రతిష్ఠ సందర్భంగా హోమం, కలశపూజ వేదపడింతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

పర్ణశాల రామయ్యకు మహదాశీర్వచనం


మహదా ఆశీర్వచనాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం ఏప్రిల్ 19: పర్ణశాల రామాలయంలో శుక్రవారం వేద ఆశీర్వచనం కార్యక్రమాన్ని శాస్త్రోపేక్తంగా నిర్వహించారు. పలువురు వేదపండితులు ఈ సందర్భంగా స్వామివారికి మహదాశీర్వచనాన్నందజేశారు. అనంతరం పర్ణశాల దివ్యక్షేత్రంలో చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. భద్రాచలం దేవస్థానం స్థానాచార్యులు కేతఈ స్థలశాయి, అనీల్‌కుమార్, ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, సీతారామానుజాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితులకు 'వసుధ' చేయూత

చెక్కులు అందజేసిన ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలం, ఏప్రిల్ 19: కేన్సర్‌తో బాధపడుతున్న ఇద్దరికి వసుధ ఫౌండేషన్ చేయూతనందించింది. భద్రాచలానికి చెందిన ఇద్దరు తమకు ఆర్థిక సాయం అందించాలని వసుధ ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. దీంతో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనరు వేగేశ్న శ్రీనివాసరావు సమాచారం అందించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు సూచన మేరకు భద్రాచలానికి చెందిన షేక్ ఖాసీంకు రూ.10 వేలు చెక్కును ఆమె కుమారుడికి, అహమ్మద్ ఉన్నిసాబేగంకు సైతం రూ.10 వేలు చెక్కును ఆమె బంధువులకు ఎఎస్పీ పరితోష్ పంకజ్ చేతుల మీదుగా వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనరు వేగేశ్న శ్రీనివాసరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు చిరస్మరణీయమన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేసే శక్తి వారికి ఒనగూరాలని ఆయన ఆకాంక్షించారు. ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనరు వేగేశ్న శ్రీనివాసరాజు, ఎస్ఏ షరీఫ్ పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న దృశ్యం

తాగునీటి ఎద్దడి నివారించాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 19: వేసవిలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని, ఏజెన్సీ ప్రాంతంలో రెండోపంటగా ఉన్న తునికాకు రేటును పెంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే. రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని సున్నం రాజయ్యనగర్, దేవులపల్లియాకయ్యనగర్‌లకు చెందిన గుడిసెవాసులకు తాగునీరు ఏర్పాటు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణం తాగునీటిని అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన నియోజకవర్గానికి చెందిన ప్రజలకు తునికాకు రెండో పంటగా ఆధాయం వస్తుందని, ఆకుసేకరణ ఏర్పాట్లు అటవీ అధికారులు నిర్దిష్టంగా చేయడం లేదని ఆరోపించారు. తునికాకు కట్ట రేటును రూ.1.50 పెంచాలని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న రమేష్

రూ.50 వేలకు మించి తీసుకెళితే ఆధారాలు చూపాలి


సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

భద్రాచలం, ఏప్రిల్ 19: పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నందున అభ్యర్థులు కాని, ప్రజలు కాని ప్రయాణ సమయాల్లో రూ.50 వేలకు మించి నగదు కాని, వస్తు సామాగ్రి తరలిస్తున్న సమయంలో తగిన ఆధారాలు చూపాలని లేకపోతే సీజ్ చేయడం జరుగుతుందని ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్ అన్నారు. భద్రాచలంలోని సబ్‌కలెక్టరు కార్యాలయంలో పినపాక అసిస్టెంట్ రిటర్నింగ్, అధికారి ప్రతీక్‌జైన్, భద్రాచలం రిటర్నింగ్ అదికారి దామోదర్‌రావు, ఎఎస్పీ పరితోష్ పంకజ్, సర్వే బృందాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎంపీ స్థానం కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించే అభ్యర్థుల వాహనం, సభలు, సమావేశాలకు తప్పనిసరి అనుమతి తీసుకోవాలన్నారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తే సర్వే బృందాలు తప్పనిసరిగా వారిపై కేసులు పెట్టి నోడల్ అధికారికి తెలియజేయాలన్నారు. రాజకీయ నాయకులు ముద్రించే కరపత్రాలు ప్రచురణ చేయించాలన్నా తప్పనిసరిగా అనుమతి పొందాలని, వాహనాలపై ప్రచారం చేస్తే వాహనం నెంబరు ప్లేటు కనిపించేలా ప్రచారథంకు అనుమతి తీసుకోవాలన్నారు. బోర్డరు చెక్‌పోస్టుల్లో పని చేసే సిబ్బంది వాహనాన్ని క్షుణ్ణంగా తనికీ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సర్వేలైన్ బృందం, వీడియో సర్వే బృందం, మోడల్ కోడ్ బృందం నిఘా చాలా ప్రతిష్ఠంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఎస్డి ఖుర్షీద్, పినపాక ఏఈవో విద్యాధరరావు, వెలుపుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి

లోకసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో దామోదర్‌రావు అన్నారు. శుక్రవారం భద్రాచలం సబ్‌కలెక్టరు కార్యాలయంలో వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో ఎన్నికల సందర్భంగా తీసుకోవలసిన కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్లకు ఓటు వేయడానికి ఇబ్బందులు కలగకుండా చూస్తామని అన్నారు. ఓటర్లు ఓటు వేయడానికి వెళ్లినప్పుడు పోలింగు స్టేషన్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని సంబంధిత ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు కలగకుండా ఏమైనా సలహాలు, సూచనలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ మణిధర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోతురాజు, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠ

మణుగూరుటౌన్, ఏప్రిల్ 19: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో శుక్రవారం పోతురాజు, ముత్యాలమ్మల విగ్రహాల పత్రిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పూజారుల వేదమంత్రోచ్చరణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. దానధర్మ ట్రస్ట్ నిర్వాహకురాలు గంట రాధ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆర్థిక సహాయమందించి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులందరు చల్లగా ఉండాలని కోరుతూ పూజలు నిర్వహించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అశ్వాపురం, ఏప్రిల్ 19: అశ్వాపురం మండల పరిషత్ కార్యలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ ముత్తినేని సుజాత అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు.

ముగిసిన శ్రీ ధర్మశాస్త్రాలయ రోడ్డు వివాదం

భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణం చేస్తామన్న అధికారులు

కొత్తగూడెం సాంస్కృతికం, ఏప్రిల్ 19: శ్రీ ధర్మశాస్త్రాలయ రోడ్డును కుదిస్తు సింగరేణి అధికారులు నిర్మాణం చేపట్టిన క్వార్టర్స్ నిర్మాణాలకు నిరసనగా ఆలయ నిర్వాహకులు చేపట్టిన దీక్ష ముగిసింది. శుక్రవారం సింగరేణి జీఎం (సివిల్) సూర్యనారాయణ ఆలయం వద్దకు చేరుకుని నిర్వాహకులతో చర్చించారు. భక్తులకు, వాహనాలకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం దీక్ష తీసుకున్న భక్తులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. దీంతో ఆలయ నిర్వాహకులు కృష్ణమూర్తి గురుస్వామి మాట్లాడుతూ భక్తుల మనోభావాలను గౌరవించినందుకు సింగరేణి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

విశేష పూజలు నిర్వహించిన అర్చకులు

ములకలపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని మంగలిగుట్ట గ్రామంలో శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి 25వ వార్షిక కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఉదయం 6గంటలకు స్వామివారి అభిషేకం తర్వాత సుదర్శన యాగాన్ని నిర్వహించి అనంతరం స్వామివారి కల్యాణాన్ని అర్చకులు శ్రీ భార్గవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త శ్రీ కేదారేశ్వరరావు సమ్మక్క దంపతులు, రేపాక ప్రసాదరావు, పద్దం దీపిక్, పడిగ ప్రశాంత్ దంపతులు పీఠలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ములకలపల్లి శివాలయం ఆలయకమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్, వీర గోపాల, డాక్టర్ సుధాకర్, వై. సాంబశివరావు, ఎస్‌పీ నాయుడు, ఎండీ రంజాన్, కుంజా జగన్, మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు డాక్టర్ కేపీఎస్. రాజు, గొడ్ల రాజు, పద్దం నర్సింహారావు, అచ్చం రాంబాబు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

అన్నదాన కార్యక్రమానికి వితరణ

అశ్వారావుపేటటౌన్, ఏప్రిల్ 19: అశ్వారావుపేట మండల పరిధిలోని పేరాయిగూడెం గ్రామపంచాయతీలోని నెహ్రూ నగర్‌లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో నవమి సందర్భంగా శుక్రవారం రామ మందిరంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిపారు. ఇదిలా ఉండగా నవమి సందర్భంగా ఏర్పటు చేసిన అన్నదాన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ నార్లపాటి సత్యవతి, రాములు తనయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీరాభిమాని నార్లపాటి రాజశేఖర్ సీతారాముల కళ్యాణ అన్నదాన కార్యక్రమానికి తనవంతు సహయంగా నిత్యవసర సరుకులు, బియ్యం అందజేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.